నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | మార్చి 30, 2024 | www.navatelangana.com

భార్య డ్యాన్స్ చేయొద్దన్నందుకు భర్త ఆత్మహత్య

- క్షణికావేశంలో ఉరేసుకొని ఆత్మహత్య



నవతెలంగాణ-నిజాంసాగర్

భార్య డీజేలో డ్యాన్స్ చేయొద్దన్నందుకు క్షణికావేశంలో భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల చిన్నఆరేపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న ఆరేపల్లి గ్రామానికి చెందిన అనిల్ అనే వ్యక్తి (28) బంధువుల పెళ్లి ఆరేపల్లి గ్రామంలో గురువారం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన డీజేలో డాన్స్ చేయడానికి భార్యకు అడగక ఆమె నిరాకరించింది. దానితో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం అతను బయటకు వెళ్లి మద్యం సేవించి మనస్థాపం చెంది క్షణికావేశంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఐదురేట్లు పెంచిన కాన్వకేషన్ ఫీజును తగ్గించాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

డిగ్రీ పీజీ పాసైన విద్యార్థులు తీసుకునే కాన్సోలేటెడ్ మెమో, ఓడీ, కాన్వకేషన్ మెమోలకు సంబంధించిన ఫీజులను 700 నుంచి రూ.3500కు ఒకేసారి ఐదు రేట్లు ఫీజులు పెంచడం దారుణమని వెంటనే తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.



మాట్లాడుతున్న విఘ్నేశ్

వివరాలు మెయిన్‌లో..



నేడు అవిశ్వాసంపై బలనిరూపణ

- కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ గిరి దక్కేది ఎవరికో

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ రాజకీయం రోజురోజుకూ రసవతంగా మారుతుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి పై అవిశ్వాసం ప్రకటిస్తూ 27 మంది కౌన్సిలర్‌లు కామారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో నేడు మున్సిపల్‌లో అవిశ్వాసంపై బలనిరూపణ చేపట్టనున్నారు. కాగా కౌన్సిలర్‌లు గత 15 రోజులుగా ప్రత్యేక క్యాంప్‌లకు తరలివెళ్లిన విషయం విధితమే. 27 మంది మున్సిపల్ కౌన్సిలర్లు కామారెడ్డి నుండి గోవా టూర్‌కి బయలుదేరి వెళ్లారు. మున్సిపల్ చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే ఈ సభ్యులు కోరం సరిపోరని ఆలోచన చేసిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కౌన్సిలర్లను 10 మందిని ఆ తర్వాత గోవా టూర్కు పిలిపించుకొని ఇన్ని రోజులు అక్కడే ఉన్నారు. గురువారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకొని, శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మహమ్మద్ అలీ షబ్బీర్ తో కలిశారు. ఇప్పటి వరకు కూడా కాబోయే మున్సిపల్ చైర్మన్ ఉరుదొండ వనితారవ, ప్రస్తుత వైస్ చైర్మన్ గడ్డం ఇందు ప్రియా పేరా ఏ పేరును ప్రకటించలేదు. దీంతో కౌన్సిలర్లలో అయోమయం నెలకొంది. ప్రస్తుతం కాంగ్రెస్ మునిసిపల్ కౌన్సిలర్ల సంఖ్య 37 కు చేరుకుంది, ఈ సంఖ్య సమావేశానికి, బల నిరూపణకు సరిపోతుంది.

మార్కెట్ కమిటీ ఆదాయానికి గండి



- మక్క పంట కొనుగోలుపై ఫీజు చెల్లించని వ్యాపారులు
- ఆదాయం కోల్పోతున్న మార్కెట్ కమిటీ
- అధికారులు స్పందించకపోతే రూ.20 లక్షల ఆదాయం కోల్పోయే అవకాశం

నవతెలంగాణ-మద్నూర్

మార్కెట్ కమిటీకి పంటల విక్రయాలే ప్రధాన ఆదాయ వనరు. కానీ పలువురి తీరు వల్ల మార్కెట్ ఆదాయానికి భారీ గండిపడే అవకాశం ఉంది. మద్నూర్ మార్కెట్ పరిధిలో ప్రస్తుతం మక్కల కొనుగోళ్లు జరుగుతున్నా.. సదరు వ్యాపారులు మార్కెట్ కమిటీకి ఫీజు చెల్లించడం లేదు. అధికారులు స్పందించకపోతే దాదాపు రూ.20 లక్షల మేర ఆదాయం కోల్పోయే అవకాశం ఉంది.

మద్నూర్ మండల పరిధిలో సుమారు 3 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగైంది. ఒక్కొక్క ఎకరానికి మక్క పంట దిగుబడి 30 నుండి 40 క్వింటాళ్లు వచ్చినట్టు అంచనా. ఈ లెక్కన సుమారు లక్ష క్వింటాళ్ల మక్క పండినట్టు తెలుస్తోంది. మార్కెఫెడ్ నుంచి కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించక పోయినా.. మక్కల డిమాండ్ ఉండటంతో వ్యాపారులు నేరుగా వచ్చి మక్కలు కొనుగోలు చేపడుతున్నారు. ప్రస్తుతం రూ.2100 ధర చెల్లిస్తున్నట్టు సమాచారం.

మార్కెట్‌కు ఫీజు చెల్లించని వ్యాపారులు

మక్కలు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు.. మార్కెట్ కమిటీకి ఫీజు చెల్లించకుండా జీరో దందాకు తెరలేపినట్టు సమాచారం. గ్రామాల్లోకి నేరుగా వెళ్లి పంట కొనుగోలు చేసుకుంటూ వెళ్లిపోతున్నారు. దీంతో మార్కెట్ కమిటీ ఆదాయానికి గండిపడే అవకాశం ఉంది. నిబంధనల ప్రకారం.. క్వింటా మక్కల కొనుగోలుపై రూ.21 మార్కెట్ కమిటీకి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కల ప్రకారం పంట దిగుబడి లక్ష క్వింటాలు కాగా మార్కెట్‌కు దాదాపు 20 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కానీ వ్యాపారులు జీరో దందాలతో కొనుగోలు చేస్తూ దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మక్క పంట దిగుబడిపై పంట అమ్మకాలపై మార్కెట్ కమిటీ అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టలేకపోవడంతో లక్షల రూపాయలు మార్కెట్ ఫీజు కోల్పోవలసి వస్తుందని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఒక్కొక్క పంటకు దిగుబడులు లెక్కేస్తూ అన్ని రకాల పంటలు దిగుబడిపై మార్కెట్‌కు రావలసిన ఆదాయం లక్షలాది రూపాయలు కోల్పోవాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు.

ఒక పత్తి పంట అమ్మకాల పైనే మార్కెట్ కమిటీ అధికారులు దృష్టి సాధించడం సరైంది కాదని, పత్తితో పాటు మక్కలు, ఇతర పంటల కొనుగోలుపై దృష్టిసారిస్తే లక్షలాది రూపాయల ఆదాయం మార్కెట్ కమిటీకి వచ్చే అవకాశం ఉంది.

మండలంలో సాగైన పంటల వివరాలు వ్యవసాయ అధికారుల అంచనాల ప్రకారం మార్కెట్ అధికారులు అమ్మకాల వ్యాపారలపై ప్రత్యేక దృష్టి సాదిస్తే మార్కెట్‌కు లక్షలాది రూపాయలు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ప్రభుత్వం జీరో దందా వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని మద్నూర్ మార్కెట్ కమిటీ పరిధిలోని రైతులు ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ మేయర్


కాంగ్రెస్‌లో పలువురి చేరికలు


షబ్బీర్‌అలీకి పుష్పగుచ్ఛం అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

పార్లమెంట్ ఎన్నికల వేళ.. బీఆర్ఎస్ పార్టీకి దెబ్బమీద దెబ్బ పడుతుంది. నిజామా బాద్ పార్లమెంట్ స్థానంలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ కదుపుతున్న పావులకు.. బీఆర్ఎస్ పార్టీ కుదేలవుతుంది. తాజాగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మేయర్ ఆకుల సుజాత శ్రీశైలంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు షబ్బీర్ అలీ సమక్షంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆమె వెంట దాదాపు 20 మంది మాజీ కార్పొరేటర్‌లు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో నిజామాబాదు మాజీ కార్పొరేటర్లు తేజశ్విని శ్రీనివాస్ రెడ్డి, అంతరెడ్డి లత దేవేందర్ రెడ్డి, గంగామణి నరేందర్ గౌడ్, గోపు సుగుణ లక్ష్మణ్, పప్పుల విజయ భజన్న, టీ చంద్రకళ, శ్రీహరి నాయక్, పంచారెడ్డి సూరి, పోతుల పురుషోత్తం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే ముత్యాల ప్రకాష్ జెండా బాలాజీ గుడి మాజీ చైర్మన్, చిన్నమనేని గంగారెడ్డి, ఇద్దండి మధుసూదన్ రెడ్డి, మావూరి పెద్దులు, బాబురావు, చింతకాయల రంజిత్, అపర్ణ, కృష్ణ, మాకు రవి, రమేష్, వీర్ కుమార్ ఉన్నారు.

మరణించిన ఆశావర్కర్ కుటుంబాలకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- ఆశా వర్కర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- సీఐటీయూ డిమాండ్, వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఆశాలు

విధుల్లో ఉండగా రోడ్డు ప్రమాదంలో ఒకరు, అనారోగ్యంతో మరొక ఆశా వర్కర్ మృతిచెందారని, వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆశావర్కర్‌లను పర్మినెంట్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ వద్ద డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విద్యకు శుక్రవారం ఆశావర్కర్‌లతో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో అలికి అబ్బవ్వ అనే ఆశా వర్కర్ విధుల్లో భాగంగా బయటకు రాగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్టు తెలిపారు. అదే విధంగా మోపాల్ మండలానికి చెందిన మరో ఆశా వర్కర్ సరోజ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి పరీక్షల డ్యూటీ చేస్తూ అనారోగ్యం పాలై గురువారం మృతిచెందినట్టు తెలిపారు. మరణించిన ఆశా వర్కర్‌ల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశాలను పర్మినెంట్ చేసి నెలకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలరన్ని పరిష్కారం చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియుగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గైని రాజమణి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యేశాల గంగాధర్, సిఐటియు జిల్లా నాయకులు జంగం గంగాధర్, కటారి రాములు, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు అనసూయ, రాజేశ్వరి, పద్మ, సుజాత, దివ్య, సుధమ్మ, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కలిసిన కామారెడ్డి కౌన్సిలర్లు


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇందుప్రియ, కౌన్సిలర్‌లు

నవతెలంగాణ-కామారెడ్డి/రామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు శుక్రవారం హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డి ఇంట్లో షబ్బీర్ అలీ సమక్షంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియా చంద్రశేఖర్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు, జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంకలిసిన జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి

రామారెడ్డి : కాంగ్రెస్ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాతో పాటు మండల అభివృద్ధికి తోడ్పడాలని సీఎంను కోరగా, సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

అరవింద్, బీబీపాటిల్ అస్థిత్వానికి, అభివృద్ధికి ఆటంకం

- వారిని గద్దెదింపే సమయం ఆసన్నమైంది
- సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్‌తో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

'నిజామాబాద్, జహీరాబాద్ అస్తిత్వానికి.. అభివృద్ధికి ఆటంకంగా మారిన ధర్మపురి అరవింద్ బీబీ పాటిల్ ను గద్దె దించే సమయం ఆసన్నమైంది. లోక్ సభలో నిజామాబాద్, జహీరాబాద్ వాణి గట్టిగా వినిపించాలన్నా అభివృద్ధి జరగాలన్నా, పేద ప్రజల అభివృద్ధికై అనుక్షణం తపించే జీవన్ రెడ్డి, సురేష్ కుమార్ షెట్కార్‌ను ఎంపీలుగా భారీ మెజార్టీ తో గెలిపించాలి. న్యాయం మీకు హక్కుగా లభించే దాకా మా ఈ పోరాటం ఆగదు' అనే నినాదంతో పార్లమెంట్ ఎన్నికల్లో ముందుకు వెళ్తున్నట్టు ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులు తెలిపారు. నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులతో కలిసి ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎఐసిసి ఇన్చార్జ్ దీపా దాస్ మున్షిని శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు.

అభ్యర్థు లు జీవన్‌రెడ్డి, సురేష్ షెట్కర్ ముఖ్య నాయ కులు ప్రభుత్వ సలహా దారు మహమ్మద్ అలీ షబ్బీర్, నరేందర్‌రెడ్డి , ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తదితర ముఖ్య నాయకులు గెలుపే లక్ష్యంగా సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరికి న్యాయం జరిగేలా అందరి జీవితాలలో కాంతులు నిండేలా ఆరు గ్యారంటీలు ఐదు న్యాయాలతో మీ మీ ముందుకు వస్తున్న మా నిజామాబాద్ అభ్యర్థి జీవన్ రెడ్డి ని జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్ని మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించండి అని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కోరారు.


రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీవన్‌రెడ్డి

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

క్రీస్తు చూపించిన మార్గంలో నడవాలి : పాస్టర్‌ల సందేశం

నవతెలంగాణ-పిట్లం/దోమకొండ


ఏసుక్రిస్తు బోధనలు వినిపిస్తున్న పాస్టర్

క్రీస్తు చూపించిన ప్రేమ, శాంతి మార్గంలో ప్రజలు నడవాలని పాస్టర్ జయరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సిఎస్ఐ చర్చ్ ఆవరణలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బైబిల్ వాక్యోపదేశము నిర్వహించి ఏసుక్రీస్తు చూపించిన ప్రేమ, శాంతి, సమాధానం , దయ, జాలి కలిగి మనుషుల పట్ల ఒకరినొకరు ప్రేమాను రాగాలతో కలిగి ఉండాలని సూచించారు. అనంతరం స్తుతి గీతాలాపన నిర్వహించి , విశ్వాసులకు యేసు నామములో ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ వరదాస్ రిటైర్డ్, రాజు దీన్ దయాల్ చర్చి స్టువర్టు , మద్దెల సంజీవులు , జాన్ , పత్తి భారతమ్మ , రేఖ జయరాజ్, గణేష్ , సురేష్ , సంఘ పెద్దలు పాల్గొన్నారు.

దోమకొండ : దోమకొండ మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో శుక్రవారం జీఎఫ్ఎం ప్రేయర్ హాల్ ఆధ్వర్యంలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రెవరెండ్ పాస్టర్ సాప శ్రీనివాస్ ప్రత్యేక సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సాప పవిత్ర, జ్ఞాన్ కుమార్, రాజ్ కుమార్, మోహన్ రెడ్డి కమల, మార్యు మరియమ్మ, రాజు రిభికా, రాజయ్య పున్నమ్మ జ్యోతి, పవిత్ర, భాగ్యమ్మ, పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని పెద్దతక్కడపల్లి గ్రామానికి చెందిన మహేష్ (30) ఈనెల 23 తేదీ నుంచి ఆచూకీ కనిపించడం లేదని ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 23వ తేదీనా తూప్రాన్‌లోని ఓ ప్రయివేటు కంపెనీలో పని నిమిత్తం వెళ్లి అక్కడ పని దొరకకపోవడంతో తిరిగి ఇంటికి బయలుదేరుతున్నట్టు చెప్పి ఇంకా ఇంటికి రాలేదని ఆయన అత్త నాగోల్ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసినవారు 8712686176 నెంబర్ కి సమాచారం ఇవ్వాలని సూచించారు.


ఇసుక దంపులు వేసిన ఇసుక మాఫియా

ఉచిత ఇసుక ఎవరికి లాభం..?

- రంగంలోకి దిగిన ఇసుక మాఫియా
- గ్రామాల్లో డంపులు.. పట్టణాల్లో విక్రయాలు

నవతెలంగాణ-వర్ని

గ్రామీణ ప్రాంతాల్లో తమ సొంత స్థలంలో ఇండ్లు నిర్మించుకునే వారికి ఆయా ప్రాంతాల్లో ఉన్న కాలువల ద్వారా ఇసుకను ఉచితంగా తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పేదలకే ఉచిత ఇసుక చేరాలని, మాఫియాను దరి చేరనివ్వొద్దని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుక పేదలందరికీ చేరేలా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. ఉచితం మంచిదే అయినా ఆ ఉచిత ఇసుక ఎవరికి లాభం చేకూర్చుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇసుక మాఫియా పేదలకు ఇసుక ఉచితంగా దొరకనిస్తాదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇసుక ఉచిత మని ప్రకటించింది మొదలు.. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వాగు, వంకాల నుంచి ఇసుక రాత్రి పగలు తేడా లేకుండా తరలుతుంది. ఇదేదో పేదలు తమ ఇంటి అవసరాల కోసం తరలించుకుంటున్నారని అనుకుంటే పప్పులో కాలేసినట్టే. ఇది చేసేది పేదలు కాదు బడా బబులు. తమకు ఉన్న సొంత ట్రాక్టర్‌లతో, లారీ లతో ఇప్పటి నుంచి గ్రామాలలో దూరి ఇసుకను పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుక ఉచితంతో ప్రధానంగా ఇసుక మాఫియానే లాభం పండుతుందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ట్రాక్టర్‌కు రూ.3000, లారీకి రూ.18,000

ప్రభుత్వం ఉచిత ఇసుక అని ప్రకటించిన మరుసటి రోజు నుంచే గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వాగుల, వంకాల నుంచి ట్రాక్టర్ యజమానులు గ్రామీణ ప్రాంతంలో ట్రిపుకు 3000 రూపాయలకు అమ్ముకొంటున్నారు. పట్టణ ప్రాంతాలకు లారీలలో తరలించే ఇసుక అక్కడ 18,000 ట్రిపు అమ్ముకోని ఇసుక మాపియా ఆర్జిస్తుంది. దీనితో ఇసుక నుంచి ప్రభుత్వానికి గ్రామాల అభివద్ధి కమిటీలకు వచ్చే ఆదాయానికి గండి పడుతుందని పతిపక్షల నాయకులు వేలు ఎత్తి అవినీతిగా చూపుతున్నారు.

పేదలకు ఉచిత ఇసుక అందుతుందా?

పెదలకు ఇప్పటికి ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం ఇవ్వలేదు. ఎన్నికల కోడ్ అయినా తరువాత ఇల్లు ఇస్తుందో లేదో తరువాత విషయం. కానీ పేదలకు అందవలసిన ఉచిత ఇసుక ప్రస్తుతం ఇప్పుడు పెద్దలకు అందుతుంది. మరో వైపు గ్రామీణ ప్రాంతాల నుంచి బాడ బాబులు ఇసుకను తరలిస్తుంటే పేదల కంటే పెద్దలకి ఎక్కువ లాభం చేకూరుతుందని ఇసుకను ఎక్కడపడితే అక్కడ దంపులు వేసుకొని వారి సొంతం కోసం అదే ఆసరాగా చేసుకొని ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తూ లక్షలాదిరూపాయలు గడిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేసి అర్హులైన వారికే ఉచిత ఇసుక అందేవిధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు దృష్టిసారించాలి

నన్నేసాబ్. సీపీఐ(ఎం) వర్ని ఏరియా కార్యదర్శి



సీఎం రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లకు ఫ్రీగా ఇసుక ఇవ్వాలని చెప్పడంతోనే అదే అదునుగా భావించి ఇసుక వ్యాపారులు వాగు, వంకల్లో నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితానే తయారు కాలేదు. కాని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకంటూ ఇసుక డంప్ చేసే ప్రయత్నాలు మాత్రం సాగుతున్నాయి. ఇసుక డంప్ చేయకుండా ప్రభుత్వం అధికారులు గ్రామాల్లో దష్టి సారించాలి.

ముఖ్యమంత్రిని కలిసిన వేంపల్లి సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వేంపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ జక్క రాజేశ్వర్ కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహుకరణగా నాగలిని అందజేస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వేంపల్లి సొసైటీ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డి అందుకు సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


నాగలిని అందజేస్తున్న జక్క రాజేశ్వర్

సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన డిసిసిబి డైరెక్టర్

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం కల్దుర్కి సొసైటీ చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ శరత్ శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందించారు. నూతనంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులతో కలిసి ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుసుకున్నారు.


సీఎంతో డీసీసీబీ డైరెక్టర్

నేడు పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

- హాజరుకానున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్


మాట్లాడుతున్న బద్దం ప్రవీణ్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని వి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల కార్యకర్తల సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు బాల్కొండ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశానికి నిజామాబాద్ బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని అన్నారు. ఉమ్మడి బాల్కొండ మండల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు. సాయంత్రం ఇఫ్తార్ విందులో పాల్గొంటారని వారు తెలిపారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యాసాగర్, మాజీ ఉపసర్పంచ్ షేక్ వాహబ్, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఫయాజ్ అలీ, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎంఎ షాహిద్, మాజీ వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సయ్యద్ మాజారోద్దీన్, సోషల్ మీడియా మండల కన్వీనర్ బుసం కృష్ణ, మండల నాయకులు నల్ల కృష్ణకాంత్‌రెడ్డి, నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

హున్సా సొసైటీలో మహాజనసభ


సభలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని హున్సా గ్రామంలో సొసైటీ చైర్మన్ మందర్న రవి అధ్యక్షతన మహాజనసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీలో చేపట్టిన లావాదేవీలు, సొసైటీ అభివృద్ధికి చేపట్టిన పనుల వివరాలను సభలో సీఈఓ హనుమంత్‌రావు రైతులకు చదివి వినిపించారు. అనంతరం సొసైటీ చైర్మన్ మందర్న రవి మాట్లాడుతూ.. రైతులు పండించిన సన్‌ఫ్లవర్ పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రైతు రుణ మాఫీని వెంటనే అమలు చేయాలని కోరారు. సొసైటీలో ఇచ్చే రైతు రుణ పరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే సొసైటీలో కొత్త సభ్యత్వాలు నమోదుకు చర్యలు చేపట్టాలని, సొసైటీ కార్యాలయం, కౌంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షులు కులకర్ణి వినోద్, సొసైటీ డైరెక్టర్స్ బి.రమేష్, దేశిపేట్ రాములు, ముద్ద సంగారం, సిద్దార్థ్, సొసైటీ, సీఈఓ ముద్ద హన్మంత్‌రావు, హున్సా, మందర్నా, ఖాజాపూర్ గ్రామాల రైతులు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పట్టుదలతో పనిచేయాలి

- కాంగ్రెస్ బాన్సువాడ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలని, అప్పుడే విజయం వరిస్తుందని కాంగ్రెస్ బాన్సువాడ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చందూర్ మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల రుణమాఫీకి 27కోట్లు ఆర్‌బీఐ నుంచి తీసుకుని రుణమాఫీ చేస్తారని అన్నారు. చందూర్ మండల కేంద్రంలో కేసీఆర్ ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్‌లలో పేదలకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా పేదలను గుర్తించి డబుల్ బెడ్ రూమ్ లేని వారికి, స్థలం లేని వారికి ఇండ్లు ఇస్తామన్నారు. అనంతరం ఉర్దూ బాషాలో భగవత్ గీతను తెలుగులో తర్జుమా చేసిన ఫాతిమాను రవీందర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. షేక్‌హైమద్ ఆధ్వర్యంలో 30 మంది మైనార్టీలు రవీందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి పలుకుల సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్ రావు, వైస్ ఎంపీపీ దశ గౌడ్, ప్రతాప్‌సింగ్, బాధ్యనాయక్, విజయ్‌రెడ్డి, వర్ని మండల అధ్యక్షులు సురేష్ బాబా, ఘన్‌పూర్ గ్రామ అధ్యక్షులు కృష్ణ, రామగౌడ్, బంజే నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ 15వ నగర మహాసభ విజయవంతం

- 19 మందితో నూతన కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ 15వ నగర మహాసభ విజయవంతమైందని, ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర నూతన కమిటీని 19 మందితో ఏర్పాటు చేసినట్టు నిజామాబాద్ ఎస్ఎఫ్ఐ నాయకులు తెలియజేశారు. శుక్రవారం నిజామాబాద్ ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన జరిగిన నగర 15వ మహాసభలు విజయవంతంగా నిర్వహించుకున్నట్టు తెలిపారు. ఈ నగర మహాసభల్లో నిజామాబాద్ ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులుగా హస్పే గణేష్, పోషమైన మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక విధానాల పట్ల తమ పోరాటం కొనసాగిస్తామని అలాగే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసేంతవరకూ ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. అలాగే నిజామాబాద్ నగరంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థల పున:నిర్మాణం చేపట్టే వరకూ ప్రభుత్వ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా పెట్టించేంతవరకు ఉద్యమాలు చేపడతామని అన్నారు. అదేవిధంగా ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర ఆఫీస్ బేరర్స్‌గా దీపిక, ఆజాద్, శివ, సందీప్, బాబురావు, అలాగే నగర కమిటీ సభ్యులుగా దుర్గా, సుమిత్ర, వీణ, అజయ్ సందీప్, సంతోష్, కార్తీక్, విశాల్, వేణు, సంతోష్, అశ్విని, శైలేష్, కార్తీక్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా అధికారులను ఆదేశించారు. ఇందూర్ జిల్లా నగరపాలక సంస్థ మంచినీటి కోసం నిర్మించిన అలీసాగర్, ఖిల్లా వాటర్ ఫిల్టర్ ప్రాజెక్టులను శుక్రవారం పరిశీలించారు. అలీసాగర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 0.30 టీఎంసీలుండగా ఇప్పుడున్న నీటి సామర్థ్యం రెండు నెలలకు సరిపోతుందని తెలిపారు. కానీ సగం యంత్రాలు పనిచేయకపోవడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారిపై మండిపడ్డారు. ఖిల్లా వాటర్ ఫిల్టర్ కూడా చాలా దారుణమైన దుస్థితి ఉందని, సరైన మెయింటెనెన్స్ లేక ఫిల్టర్ అయిన నీటిలో నాచు, వేస్ట్ పదార్థాలు చెత్త పేరుకుపోయి ఉన్నాయని అన్నారు. ప్రజల జీవితాలతో ఇరిగేషన్ అధికారులు ఆడు కుంటున్నారని, అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శమని మండిపడ్డారు. వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌లో మాట్లాడి వారంరోజుల్లో దీనిపై నివేదిక ఇవ్వాలని అన్నారు. యంత్రాలన్నీ పనిచేసేవిధంగా చర్యలు తీసుకొని, స్వచ్ఛమైన తాగునీటిని నగర ప్రజలకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బిజెపి ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, బిజెపి కార్పొరేటర్, మండలాధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బోదేపల్లి గ్రామంలో బోదేపల్లి మాజీ సర్పంచ్ నోముల రవి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నోముల మోహన్, ఉపాధ్యక్షులు నార్ల రాజు, బీఆర్ఎస్ నాయకులు కోట మురళి ఆధ్వర్యంలో శుక్రవారం టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 25 జట్లు పాల్గొంటున్నాయని అన్నారు. ఫస్ట్ విన్నర్ ప్రైస్ రూ.20,001 విత్ ట్రోఫీ, సెకండ్ విన్నర్ ప్రైస్ రూ.10,001 విత్ ట్రోఫీ బహుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌లో ఆసక్తిగా పాల్గొనేవారు ఎంట్రీ ఫీజు రూ.1500 చెల్లించాలని, మరిన్ని వివరాలకు శ్రీను 9951319128, రజినీకాంత్ 8500830354, ప్రేమ్‌కుమార్ 6302297270 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

టీడీపీ ఆవిర్భావ వేడుకలు

- అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్టు గుర్తు చేసిన నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/వర్ని

తెలంగాణలో నేడు మనం చూస్తున్న అభివృద్ధి కేవలం తెలుగుదేశం పార్టీ హయాంలో చేసిందేనని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదగౌడ్ అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. పార్లమెంట్ అధ్యక్షతన దేగాం యాదగౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేగాం యాదగౌడ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఇప్పటికీ పార్టీలో ఉన్న కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ పుట్టుకను ఒక నవశకంగా చెప్పుకొచ్చారు. ఆనాటి పరిస్థితుల్లో తెలుగు వాడికి ఎలాంటి గుర్తింపు లేని సమయంలో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టి, ప్రజలను చైతన్య పరుస్తూ ప్రపంచ స్థాయిలో ఒక గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. వెట్టి చాకిరి వ్యవస్థని రూపుమాపి మరో స్వాతంత్రం తెచ్చారని అన్నారు. ప్రస్తుతమున్న సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ, గత ప్రభుత్వంలో చేసిన అవినీతిని మొత్తాన్ని బయటపెట్టి శిక్షిస్తారని మనస్ఫూర్తిగా నమ్ముతున్నామన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఇంఛార్జి వినోద్ కుమార్, బోధన్ నియోజకవర్గ ఇంఛార్జి కోట గోపాల్‌రెడ్డి, పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ రెంజర్ల సురేష్, అనుబంధ సంఘాల అధ్యక్షులు దంతాల ఆనంద్, బోబ్బా నరసింహరావు, మండల అధ్యక్షులు చిలుక సత్య నారాయణ, పసులా రాజు, అర్బన్ సీనియర్ నాయకులు కల్లెడ గంగాధర్, శంకర్ ముదిరాజ్, లవంగ రాజు, ఆర్సపల్లి అశోక్, రవి కుమార్ పాటిల్, మల్లారెడ్డి, రాములు, గంగోనె రాజేశ్వర్, నాగేశ్వర్ రావు, హరీష్, రమేష్, రామకృష్ణ రెడ్డి, విష్ణు, బాలరాజు, చెన్నమ్మ, విజయ లక్ష్మి, గోపి, నరేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వర్ని :తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వర్ని మండల కేంద్రంలో టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు కేక్‌కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బి.విఠల్, సీనియర్ నాయకులు మార్ని రాజారావు, రెడ్డి వినోద్, బోగవల్లి వినోద్, అంబం సాయిలు, వెంకటేష్, చక్రధర్‌రావు, సత్యనారాయణ, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.


నిజామాబద్‌సిటీ : కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

భేటి బచావో భేటి పడావోపై కళాజాత


కళాజాతలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-మాక్లూర్

ఆలూర్ మండలంలోని కల్లెడ గ్రామంలో బేటి బచావో బేటి పడావోపై ప్రొజెక్టర్ ద్వారా కళాజాతను గురువారం నిర్వహించారు. గ్రామంలో ప్రజలకు ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. బేటి బచావో బేటీ పడావోపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఐసిడిఎస్ సునీత తెలిపారు. మండల కేంద్రంలో మహిళ శిశుదివ్యాంగుల, వయోవృద్ధులశాఖ పరిధిలో మహిళ సాధికారత కేంద్ర ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రొజెక్టర్ ద్వారా చిత్ర ప్రదర్శనతో బాల్య వివాహాలు, మహిళలపై హింస, అరాచకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్, సాధికార కేంద్రం సిబ్బంది స్వప్న, సౌమ్య, కవిత, పుష్ప, ఐకెపి, ఆశావర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు పద్మ, అంజమ్మ, విజయ, సరోజన తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు


కొనుగోలు కేంద్రం కోసం భూమి చదును

నవతెలంగాణ-బాల్కొండ

యాసంగి ధాన్యం సేకరణకు సర్కారు సర్వం సిద్ధం చేసింది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న వడ్ల కొనుగోలు ప్రక్రియలో భాగంగా బాల్కొండ మండల పరిధిలోని బాల్కొండ, వన్నెల్.బి, చిట్టాపూర్, జలాల్‌పూర్ గ్రామాలలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు సహకార సంఘం సీఈవో మోహమ్మద్ మోహిద్ పాషా తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రం స్థలాన్ని చదును చేసి తగు ఏర్పాట్ల పనులను చేపట్టారు. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను చేపట్టాలనే ఉద్దేశంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సీఈఓ అన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి


పూజ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని విఠలేశ్వర, అయ్యప్ప, ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల కార్యకర్తలతో మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. తాను ఎంపీగా గెలిస్తే కార్యకర్తలందరికీ అందుబాటులో ఉంటానని, ప్రజాసేవలో ముందుంటానని అన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు తిరుమల సర్వాగౌడ్, మండల కోఆప్షన్ మెంబర్ కోక హైమద్, మాజీ సర్పంచ్ రాథోడ్ గంగాధర్, అబ్బన్న, ప్రభుత్వ ఉన్నత పాఠశాల చైర్మన్ మర్ల దత్తాద్రి, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు తాజొద్దీన్, మైనార్టీ మండలాధ్యక్షులు కరీమ్, దార్గల సాయిలు, రాచర్ల గంగాధర్, పెద్దలు, కొత్త రాజు తదితరులు పాల్గొన్నారు.

రెంజర్ల సొసైటీలో మహాజన సభ


మహాజన సభలో పాల్గొన్న పలువరు

నవతెలంగాణ-ముప్కాల్

రెంజర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం ఉదయం సొసైటీ అధ్యక్షులు కోమటిశెట్టి గంగాధర్ అధ్యక్షతన మహాజన సభను నిర్వహించారు. ఈ మహాజన సభకు సహకార సంఘం డైరెక్టర్లు, క్లస్టర్ రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మహాజన సభలో స్థానిక సొసైటీ సెక్రటరీ కె.గంగాధర్ సంఘం ఆర్థిక లావాదేవీలు, జమ ఖర్చులను చదివి వినిపించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షలు ముస్కు సంతోష్‌రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రమేష్, కోమటిశెట్టి చింటు, క్యాతం గంగారెడ్డి, బుయ్య రాజన్న, దాసరి నర్సయ్య, బద్ది ప్రసాద్, సెక్రటరీ కె.గంగాధర్, సొసైటీ సిబ్బంది, సొసైటీ క్లస్టర్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
శనివారం | మార్చి 30, 2024 | www.navatelangana.com

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్, కిచాన్నపెట్ సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు సీఈవో జైపాల్ రెడ్డి శుక్రవారం తెలిపారు. తాండూర్ మెళ్లకుంట తండా రెండు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు సీఈఓ తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకే తీసుకురావాలని దళారులకు నమ్మవద్దని సూచించారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో జైపాల్‌రెడ్డి

సెలవుల్లో స్పెషల్ ఆఫీసర్‌లు

- జీపీల్లో నిలిచిన చెల్లింపులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలో 4 గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లు లేక ఇటు గ్రామ ప్రజలు అటు పంచాయతీ పాలనలో సమస్యలు ఎదురవుతున్నాయి. సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు స్పెషలాఫీసర్లను నియమించిన విషయం తెలిసిందే. భిక్కనూర్, లక్ష్మీదేవినిపల్లి, అంతంపల్లి, కాచాపూర్ గ్రామాలకు ఎంపీడీవో సంతోష్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రోజాను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. అయితే డిప్యూటీ తహసీల్దార్ సెలవులపై వెళ్లగా, ఎంపీడీవో ఇటీవల ఏసీబీ వలలో చిక్కారు. దీంతో నాలుగు గ్రామాలలో తీర్మానాలు చేయాలన్నా, సమస్యలు పరిష్కరించాలన్న, బిల్లులు చెల్లించాలన్నా స్పెషల్ ఆఫీసర్లు లేక పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మౌనం వీడి.. పోరుబాట పట్టేనా..?

- కెమికల్ కంపెనీ పై 11 గ్రామాల జేఏసీ మౌనం
- హైకోర్టుకు వెళ్లడమా..?, ఉద్యమాన్ని ఉధృతం చేయడమా..?
- ముందుకు రాని ప్రజాప్రతినిధులు
- కంపెనీపై తిరుగుబాటుకు సిద్ధమవుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-భిక్కనూర్

కెమికల్ కంపెనీతో గాలి, నీరు కాలుష్యం అవుతున్న కారణంగా భిక్కనూర్, బిబిపేట్, దోమకొండ మండలంలోని 11 గ్రామాల ప్రజలు జేఏసీగా ఏర్పడి కంపెనీపై గతంలో తిరుగుబాటు చేసిన విషయం తెలిసిందే. గత కొన్ని రోజులుగా కెమికల్ కంపెనీ నుండి వాసన విపరీతంగా వస్తున్న కారణంగా జేఏసీగా ఏర్పడిన 11 గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలు ఉద్యమంగా ఏర్పడి మరోసారి కంపెనీపై ఉద్యమం చేస్తారా..? ప్రజా ప్రతినిధులు మౌనంగా ఉన్న కారణంగా హైకోర్టును ఆశ్రయిస్తారా..? తదుపరి కార్యచరణ ఏంటని సర్వత్రా చర్చనీయాంశం అవుతుంది. మౌనంగా ఉండడానికి గల కారణాలు ఏంటి అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఓ గ్రామానికి చెందిన యువకుడు ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రస్తుతం మౌనంగా ఉన్నారని, మౌనానికి గల కారణాలు ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కెమికల్ కంపెనీ పై 11 గ్రామాల జేఏసీ మౌనం

జేఏసీ ఉద్యమం తీవ్రతరం చేసి కంపెనీ మూసివేసే వరకు ఉద్యమం ఆగదు అన్నట్టు గొడవలు చేసిన జేఏసీ ఉద్యమ నాయకులు ఎందుకు స్పందించడం లేదని మౌనానికి గల కారణాలు ఏంటని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో కంటే ఇప్పుడు కెమికల్ వాసనతో గాలి కాలుష్యమవుతున్నా ఎవరూ స్పందించడం లేదని స్థానికంగా చర్చనీయాంశం అవుతుంది. గతంలో ఆందోళన చేస్తే కంపెనీ యాజమాన్యం అప్పటికప్పుడు కంపెనీ నుండి ఎలాంటి గాలి, నీరు కాలుష్యం కాకుండా చర్యలు తీసుకుంటామని జేఏసీ నాయకులకు హామీ ఇచ్చింది. కానీ ఆ హామీని విస్మరించింది. వేడి మీద ఉన్న ఉద్యమాన్ని నీళ్ళు చల్లి ఆర్పేశారే తప్ప పూర్తిస్థాయిలో కంపెనీ యాజమాన్యం కెమికల్ వాసన రాకుండా చర్యలు తీసుకోలేదు.


గతంలో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టిన గ్రామస్తులు(ఫైల్)


కెమికల్ కంపెనీ

జేఏసీకి ప్రజాప్రతినిధుల మద్దతు ఎందుకు లేదు..?

గత ప్రభుత్వ సమయంలో జేఏసీ నాయకులకు ఉన్న మద్దతు ప్రస్తుత ప్రభుత్వ సమయంలో ఎందుకు లేదు..?, కంపెనీపై తీవ్ర పోరాటం చేసిన మండలానికి చెందిన ఓ ప్రజా ప్రతినిధి ప్రస్తుతం మౌనానికి గల కారణాలు ఏంటి. కంపెనీపై పోరాటం చేసిన జేఏసీ విచ్ఛిన్నమైందా..?. అసలు ప్రజాప్రతినిధుల జేఏసీకి మద్దతు ఎందుకు లేదు అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వమైన కెమికల్ కంపెనీ పై చర్యలు తీసుకుంటుందా, ప్రజా ప్రతినిధుల మద్దతు ప్రజలకు ఉంటుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కంపెనీపై సిద్ధమవుతున్న ప్రజల తిరుగుబాటు..

రాత్రి సమయంలో కంపెనీ నుండి వస్తున్న కెమికల్ వాసన కారణంగా జేఏసీ గ్రామాల మద్దతు లేకున్నా గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు కంపెనీపై తిరుగుబాటుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎన్నిసార్లు కంపెనీ యాజమాన్యానికి తెలియజేసిన కంపెనీ గేటు నుండి తిరిగి పంపించేస్తున్నారని, ప్రజా ప్రతినిధుల మద్దతు లేకున్నా గ్రామ ప్రజలను ఏకమై ఉద్యమానికి తెర లేపుతున్నట్లు సమాచారం.

హైకోర్టుకు వెళ్లడమా..?, ఉద్యమాన్ని ఉధృతం చేయడమా..?

కెమికల్ కంపెనీ నుండి బాధపడుతున్న బాధిత గ్రామాల ప్రజలు ఏకమై ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ వరకు ఫిర్యాదు చేయడం అవసరమైతే ముఖ్యమంత్రి వరకు వెళ్లి కంపెనీపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. అప్పటికి సమస్య పరిష్కారం కాకుంటే హైకోర్టును ఆశ్రయించేందుకు ప్లాన్ రూపొందించే అవకాశం ఉన్నట్టు సమాచారం. కెమికల్ కంపెనీ కారణంగా భిక్కనూరు మండల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రాత్రి సమయంలో ఊపిరి ఆడకుండా, నిద్ర లేకుండా చేస్తున్న కెమికల్ కంపెనీ యాజమాన్యం ఇప్పటికైనా తమ పద్ధతిని మార్చుకొని ప్రజల ప్రాణాలు దృష్టిలో ఉంచుకొని కెమికల్ వాసనలు, నీరు కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదం జరిగిన, ప్రాణం ఇస్తాం జరిగిన కంపెనీ పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని బాధిత గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

ఉద్యమం తప్పదు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్

ప్రజల ప్రాణాలకు హాని కలిగించే కెమికల్ కంపెనీలు తమ పరిధిలో నిర్వహించుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఆ ప్రాణహాని జరిగినా కంపెనీ మూసివేసే వరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. గాలి, నీరు కాలుష్యం కాకుండా అధికారులు కెమికల్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మానవ హక్కులకు భంగం కలిగితే చర్యలు తప్పవు

మహిపాల్ (జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు)

మానవ హక్కులకు భంగం కలిగే విధంగా కంపెనీల ద్వారా ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఏర్పడిన, కార్మికులకు ప్రాణహాని జరిగిన మానవహక్కుల కమిటీ తరఫున కెమికల్ కంపెనీలపై చర్యలు తప్పవని, ప్రభుత్వానికి తెలియజేసి కంపెనీలపై శాకాపర్యమైన చర్యలు తీసుకుంటాము. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారుని దృష్టికి తీసుకెళ్లి కెమికల్ కంపెనీ నుండి గాలి, నీరు పొల్యూషన్ కాకుండా చర్యలు తీసుకోడమా లేకుంటే కంపెనీని మూసివేసేలా చర్యలు తీసుకుంటాం.

సరిహద్దు పంచాయితీ.. గుడికి తాళం

నవతెలంగాణ-భిక్కనూర్

రెండు గ్రామాల మధ్య రెవెన్యూ శివారు, సరిహద్దు విషయమై నెలకొన్న పంచాయితీతో గత కొన్ని రోజులుగా ఆలయ శివారులోని ఆంజనేయ స్వామి ఆలయానికి తాళం దర్శనమిస్తుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని 44వ జాతీయ రహదారి పక్కన పెద్ద మల్లారెడ్డి రహదారిలో హనుమాన్ ఆలయ మందిరం ఉంది. ఈ ఆలయ విషయంలో బస్వాపూర్, సిద్ధ రామేశ్వరనగర్ గ్రామస్తుల మధ్య గొడవలు గతంలో చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో దర్శనానికి వచ్చిన సందర్శకులకు కొన్ని రోజులుగా గుడికి తాళం వేసి కనిపిస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం తాళం వేసి కనిపిస్తుందని సిద్ధరామేశ్వనగర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


తాళం వేసి ఉంచిన దృశ్యం

రేపు బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

నవతెలంగాణ-కామారెడ్డి

ఈనెల 31న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య గార్డెన్ లో కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గెరిగంటి లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి , మాజీ ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ , బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షులు యంకె ముజీబోద్దీన్ , జహీరాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ తదితరులు హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ విస్తృత స్థాయి సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

కుమ్మరిగల్లీలోవారాంతపు సంత నిర్వహించాలి


మాట్లాడుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని శ్రీ సిద్ధ రామేశ్వర బ్రహ్మోత్సవాల సమయంలో గత పూర్వకాలం నుండి వారాంతపు సంతను పట్టణంలోని కుమ్మరి గల్లీ కాలనీలో నిర్వహించేవారని, ఈ ఆదివారం కూడా ఆనవాయితీగా వస్తున్న వారాంతపు సంతను కుమ్మరి గల్లీలోని పాత సిద్ధ రామేశ్వర ఆలయ సమీపంలో నిర్వహించాలని కాలనీవాసులు పంచాయతీ ఈవో మహేష్ గౌడ్‌కు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ అధికారులు స్పందించి ఆనవాయితీ ప్రకారం కుమ్మరి గల్లీలో వారాంతపు సంతను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

శ్రీ కాలబైరవ స్వామిని దర్శించుకున్న బీబీపాటిల్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్న పల్లి (రామారెడ్డి) లో వెలసిన శ్రీ కాలబైరవ స్వామి దేవస్థానాన్ని శుక్రవారం జహీరాబాద్ బిజెపి ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు ఆయనకు శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు, స్వామి వారి జ్ఞాపకం అందజేశారు. ఆయన వెంట బిజెపి నాయకులు పైళ్ల కృష్ణారెడ్డి, దేవదాసు, రామకృష్ణ, గోపి, తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ

'ఆఖరి సఫరీకి ఘూడి' అందజేత


ఘూడీని అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని గొల్లవాడ కబరస్తాన్‌కు కేపి.రాజారెడ్డి జనసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆఖరి సఫారీకి ఘూడి (అంతిమ యాత్రకి ఉపయోగించే రథం) కబరస్తాన్ నిర్వాహకులకు ట్రస్ట్ సభ్యులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కబరస్తాన్ నిర్వాహకులు మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలోని పేద ముస్లింలకు ఈ వాహనం ఉపయోగ పడుతుందని, లక్షల విలువ చేసే వాహనాన్ని ఎలాంటి షరతులు లేకుండా అందరికీ ఉపయోగ పడే విధంగా ఇవ్వడం సంతోషకరం అని అన్నారు. ట్రస్ట్ సభ్యులకు, కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డికి ముస్లింల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్ పార్టీలో చేరిన్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

జిల్లా జాగృతి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్ బిఆర్ఎస్ పార్టీ, జాగృతి జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన శ్రీరామ్ వెంకటేష్ కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ యువకులు నవీన్ రెడ్డి, నితీష్ గౌడ్, తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి, ఎన్నారై సెల్ జిల్లా అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, భిక్కనూర్ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి (మాచారెడ్డి) : మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామ బిఆర్ఎస్ శాఖ యువజన విభాగం అధ్యక్షుడు కర్రోళ్ల శేఖర్ గౌడ్ శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మిను కూరి బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇందూరి శ్రీనివాస్ గౌడ్ ,ఇందూరి నరేష్ గౌడ్ ,అనాచి బాల నర్సు, అనాచి బాలకిషన్, ఇందూరి నారా గౌడ్, ఇందూరి నర్సాగౌడ్, దేవల రాజాగౌడ్, తొర్రోళ్ల నవీన్ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

500 బోనస్ ఇచ్చి వరి కొనుగోలు చేయాలి: వేముల

నవతెలంగాణ-భీంగల్

రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన హామీల అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఇచ్చిన హామీల్లో వరి కొనుగోలుకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం భీంగల్ పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లి, మోర్తాడ్ భీంగల్ మండలాలకు చెందిన రైతుల పక్షాన పోరుబాట కార్యక్రమాన్ని భీంగల్‌లో నిర్వహించారు. ఇప్పటివరకు వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో భీంగల్ లాంటి ప్రాంతాలలో ఇప్పటికే రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మేశారని గుర్తుకు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పేగులు మెడలో వేసుకుంటా అని చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు మానుకొని ప్రజలకు సుపరిపాలన అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కింది స్థాయి నాయకులు మండల కేంద్రాలలో పైరవీలు చేసేందుకు ఆఫీసులను పంచుకుంటున్నారన్నారు. అలాగే ఒకరిద్దరూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను బెదిరించి పార్టీలో చేర్చుకుంటే తమకు వచ్చిన నష్టమేం లేదన్నారు. తమ కార్యకర్తలు ఆణిముత్యాలు లాంటి వారని వారు ఎప్పుడు కెసిఆర్‌కు అండగా ఉంటారన్నారు. ప్రస్తుతం ఎంపీ ఎలక్షన్లు వస్తున్న తరుణంలో కాంగ్రెస్ ఓట్ల కోసం ప్రజలకు మరోసారి లేనిపోని హామీలను గుప్పించేందుకు ముందుకు వస్తుందని కనుక ప్రజలు, రైతులు వారికి తగిన గుణపాఠం ఓటుతోనే చెప్పాలని తెలియజేశారు.


మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-నాగిరెడ్డిపెట్

కాంగ్రెస్ పార్టీ నాగిరెడ్డిపేట్ మండల కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ మండల అధ్యక్షులు అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ శుక్రవారం తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా సుధాకర్, లక్ష్మణ్, జనరల్ సెక్రెటరీగా దివిటీ కిష్టయ్య, సెక్రటరీగా వెంకటరామిరెడ్డి, కలలి మురళి గౌడ్, ట్రెజరీగా కలాలి లక్ష్మా గౌడ్, డిసిప్లిన్ కమిటీ అధ్యక్షుడిగా రామచంద్ర రెడ్డి, బోయిన విట్టల్, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా విట్టల్ రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభు గౌడ్ బీసీ సెల్ ప్రెసిడెంట్ గా కుమార్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ జీవరత్నం, ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ గా వర్జ్యనయక్, మైనారిటీ ప్రెసిడెంట్ గా ఇమామ్ యూత్ ప్రెసిడెంట్ గా శ్రీరామ్ గౌడ్, అడ్వైజర్ కమిటీ సభ్యులుగా ఫారూఖ్, వసంత్ రెడ్డి, సంజీవులు, బాల్రెడ్డి ,భూమరెడ్డి సోషల్ మీడియా సభ్యులుగా ప్రశాంత్, ఆరిఫ్ లను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏకగ్రీవంగా నియమించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వాసు రెడ్డి బోయిన విటల్, దివిటీ కిష్టయ్య, షాయద్ పాషా, ఇమామ్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రం చూపుతున్న నాయకులు

నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల పరిహారం ఇవ్వాలి

- ఎస్‌పిఐయు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు రవి

నవతెలంగాణ-కామారెడ్డి

ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం చెల్లించాలని ఎస్‌పిఐయు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు రవి డిమాండ్ చేశారు. సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ (ఎస్‌పిఐయు) కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి బానోతు రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కామారెడ్డి జిల్లాకు చెందిన పలు పార్టీల నాయకులు కార్యకర్తలు ఎస్‌పిఐయు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్ర మౌని పురుషోత్తం, పార్టీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు ఎర్ర రాజేష్ హాజరై మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలు నచ్చి నవ సమాజ స్థాపన కై ,రాజకీయ సమ న్యాయం జరగాలంటే, బడుగు బలహీన వర్గాలు హక్కులను సాధించుకోవాలంటే ,బహుజనులకు రాజ్యాధికారం రావాలంటే, అది ఎస్ పి ఐ యు పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై వివిధ రాజకీయ పార్టీల నుంచి సుమారు 50 మంది చేరినట్టు తెలిపారు. వారికి ఎస్.పి.ఐ. యు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొద్రమోని పురుషోత్తం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు అర్ రామచందర్, ఆర్ జాన్సీ , ఏఐడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బీ బాను ప్రసాద్, గోవింద్ నాయక్, ఏఐడబ్ల్యుటియు జిల్లా అధ్యక్షులు బూర్క దేవరాజ్, ఏఐ డి ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ఏఐడిఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు విజయ , రేణుక, స్వప్న, దాసరి మహిపాల్, జిల్లా సహాయ కార్యదర్శి సత్యం, చారి, కామారెడ్డి నాయకులు సాయిరాం, తదితర 50 మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌పీఐయూలో పలువురి చేరిక

ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేట్ గ్రామానికి చెందిన బలగం రాజయ్య అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్‌రెడ్డితో కలిసి రాజయ్య కుమారుడు శ్రీకాంత్ స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల మదన్ మోహన్ రావును కలవగా రూ 5 లక్షల విలువగల ఎల్ వో సి ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్, స్థానిక ఎమ్మెల్యేకు, సహకరించిన మహేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామారెడ్డి మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు నిశాంత్ తదితరులు ఉన్నారు.


ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మోడేగాంలో కాంగ్రెస్ కమిటీని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి ఆధ్వర్యంలో శు క్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా కుంట లింగారెడ్డి, ఉపాధ్యాక్షులు దాసరి నడ్పి బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా వల్ల కొండ సురెందర్ రెడ్డి, కార్యదర్శిగా లోకుల దర్శనం, కోశాధికారిగా పతకం సాయిలు, సోషల్ మీడియా కన్వీనర్‌గా దాసరి రాజేశ్వర్, బిసి అధ్యక్షులుగా రాములు, మైనారిటీ అధ్యక్షులుగా ఎం.డి అఫ్రస్ , ఎస్సీ అధ్యక్షుడు దాసరి ఓంకార్, యూత్ అధ్యక్షులు కాశీరెడ్డి ,రాజిరెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.


ఎన్నికైన నాయకులు

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజ్ మరమ్మతులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ సంత సమీపంలో గల మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ కావడంతో గత కొన్ని రోజులుగా రోడ్డుపై నుంచి నీరు వెళ్లడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. గ్రామపంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ తన సిబ్బందితో మరమ్మతు పనులను చేపట్టారు. ఈ రోడ్డుపై నుంచి వాహనాలను సాటాపూర్ సంత మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకొని పైప్‌లైన్ మరమ్మతులను పూర్తి చేసినట్టు ఆయన పేర్కొన్నారు.


మరమ్మతు పనులు చేపడుతున్న దృశ్యం

బాగేపల్లి చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి సిఎస్ఐ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు సిలువలో మాట్లాడిన ఏడు మాటలను భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ధ్యానించినట్టు తెలిపారు. కార్యక్రమంలో చర్చి కమిటీ పెద్దలు అలిగి అభిషేక్, అలిగే దేవరాజ్, సిరిగిరి స్వామి దాస్, రాహుల్, సంతోష్, వినయ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

సీఎంను కలిసిన నూతన మున్సిపల్ చైర్‌పర్సన్, నియోజకవర్గ నాయకులు


ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గ ఇంచార్జ్ పొద్దుటూరు వినయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నూతనంగా ఎన్నుకోబడిన మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ కలిశారు. అలాగే మాజీ మున్సిపల్ చైర్మెన్‌లు సంజయ్ సింగ్ బబ్లూ, పండిత్ పవన్, మున్సిపల్ వైస్ చైర్మన్ షైక్ మున్నాభాయ్, పట్టణ కౌన్సిలర్లు ఇట్టేది నర్సారెడ్డి, శాల ప్రసాద్, రవి గౌడ్, ఆకుల రాము, ఎస్.ఆర్.రమేష్, అథిక్, ఫయాజ్, ఇంత్యాజ్, కొంతం మంజుల మురళి, వనం శేఖర్, శివ, డార్లింగ్ రమేష్, తాటి హన్మాండ్లు, రంగన్న, బాదం రాజ్‌కుమార్, రింగుల భూషణ్, పట్టణ అధ్యక్షులు సాయిబాబా గౌడ్, పట్టణ నాయకులు అజ్జు భాయ్, ఫాయిమ్ భాయ్, మారుతిరెడ్డి, రాజుభాయ్, రవీందర్‌రెడ్డి, జిమ్మి రవి, భుపేందర్, హబీబ్, మెహమూద్ అలీ తదితరులు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో కలిసి.. మున్సిపల్ నూతన భవనానికి, అభివృద్ధి పనులకు నిధులను కేటాయించాలని వినతిపత్రాన్ని అందజేశారు.

క్రీడలతో పోటీతత్వం అలవర్చుకోవాలి


పస్కా నర్సన్నకు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలతో పోరాట తత్వాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, తెలంగాణ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, ప్రస్తుత ఆర్మూర్ ఎంపీపీ పస్కా నర్సన్న అన్నారు. ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ క్రీడల ద్వారా విద్యార్థులు ఉద్యోగాల్లో రాణించడానికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. దాంతోపాటు ఈ పోటీలను నిర్వహిస్తున్న ఎన్ఎస్‌యుఐ యూనివర్సిటీ కమిటీని అభినందిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ యూనివర్సిటీ అధ్యక్షులు కొమిర శ్రీశైలం, ప్రధాన కార్యదర్శులు రాజేందర్, సాగర్ నాయక్, ఉపాధ్యక్షులు మహేష్, అనిల్, నవీన్, విజయ్‌కుమార్, అశ్విన్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల సమావేశాన్ని శనివారం సాయంత్రం 3.00 గంటలకు కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో గల లహరి ఇంటర్నేషనల్ హోటల్లో ఉంటుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నేతల జరగబోయే ఎన్నికల సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డిసిసి నిజామాబాద్ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్ మనాల మోహన్‌రెడ్డి, డిసిసి జగిత్యాల అధ్యక్షులు, ఎమ్మెల్యే లక్ష్మన్, కార్పొరేషన్ చైర్మన్‌లు ఈరవత్రి అనిల్ కుమార్, అన్వేష్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి సునీల్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి నర్సింగ్‌రావు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి నేతలు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

యూనివర్సిటీ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ గిరిజన శక్తి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శ్రీను నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులతో కలిసి చర్చించామని, వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని గ్రంథాలయంలో సరైన పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హెల్త్ సెంటర్లో 24గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉండాలని, కొత్తగా మహిళలకు నూతన వసతి గృహం నిర్మించాలని తదితర డిమాండ్లను సమావేశంలో తీర్మానించామని వివరించారు. గిరిజన శక్తి జనరల్ సెక్రెటరీ సాగర్ నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కావలసిన సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను తగుచర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నరేష్ నాయక్, నిఖిల్ నాయక్, శివ నాయక్, సంజయ్ నాయక్, కృష్ణ, శ్రీకాంత్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిన మంటలు..

- మల్లారం అటవీ ప్రాంతంలో ఘటన
- మంటలార్పిన ఫారెస్ట్ సిబ్బంది

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ రూరల్ మండల పరిధిలోని మల్లారం గ్రామ శివారులో గల అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మారావు వివరాల ప్రకారం.. మల్లారం అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగినట్టు ఫారెస్టు అధికారులకు సమాచారం రావడంతో వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే సుమారుగా 50 నుంచి 100 మీటర్ల వరకు నిప్పంటుకున్నట్టు ఫారెస్టు అధికారులు భావిస్తున్నారు. కాగా.. గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రత పెరిగినందున మంటలు చెలరేగాయా? లేదా ఎవరైనా ఆకతాయిలు అటవికి నిప్పు పెట్టారా? అనేది తెలియాల్సి ఉంది. అధికారులు సరైన సమయంలో ఘటనా స్థలానికి రావడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. కాగా.. ఐదు మీటర్ల వైశాల్యంలో ఎత్తు వరకు మంటలు చెలరేగితే హైదరాబాద్ హెడ్ ఆఫీస్‌కు శాటిలైట్ ద్వారా నివేదికలు చేరుకుంటాయని, అక్కడి నుంచి సంబంధిత జిల్లా అధికారికి ఫోటోలతో కూడిన సమాచారం 5-10 నిమిషాల్లో వస్తుందని, తాము మంటలార్పేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉన్నామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మారావు తెలిపారు.


మంటలార్పుతున్న ఫారెస్ట్ సిబ్బంది

మానవతావాది.. వీపీ చందన్‌రావు

- సీనియర్ జర్నలిస్ట్, సంపాదకులుబైస దేవదాసు
- ఘనంగా చందనాగ్ని కవితా సంపుటి ఆవిష్కరణ సభ

నవతెలంగాణ-కంఠేశ్వర్

వీపీ చందన్‌రావు కవిత్వంలో మానవతావాదం తొణికిసలాడుతుందని అందుకే అతని కవిత్వ సాఫల్యం దిశగా సాగిందని సీనియర్ జర్నలిస్ట్, సంపాదకులు బైస దేవదాసు అన్నారు. శుక్రవారం హరిచరణ్ మార్వాడి డిగ్రీ కళాశాలలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ కవి, వ్యాఖ్యాత విపి చందన్‌రావు రచించిన చందనాగ్ని కవితా సంపుటి ఆవిష్కరణ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కవిత్వం జన్మత వచ్చినా అధ్యయనంతో శిఖరాగ్రాలకు చేరుకుంటుందని సమాజానికి దారి చూపుతుందని అన్నారు. కవులతో సంచారం వలన, వారితో స్నేహంగా మెలగడం వలన ధైర్యం, అనుశీలనా శక్తి పెరుగుతాయని, తన జీవితంలో ప్రభావం చూపిన వారిలో అలిశెట్టి ప్రభాకర్ తర్వాత విపి చందన్‌రావు అని ఆయన కవిత్వం సహజత్వంతో చమత్కారంతో మానవతా వాదంతో పాఠకులను ఆకట్టుకుంటాయని తెలిపారు. 50 ఏళ్ల సాహిత్య జీవితంలో విపి చందన్‌రావు సృజించిన సాహిత్యమంతా ముందు తరం కవులకు సాహిత్యాభిమానులకు ఆదర్శంగా నిలుస్తుందని అభినందించారు. నిజామాబాద్ జిల్లా సాహిత్యాన్ని, సాహిత్య గౌరవాన్ని ఇనుమడింపజేసిన వారిలో విపి చందన్‌రావు అగ్రగణ్యులని అన్నారు. సభలో కీలక ప్రసంగం చేసిన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ.. చందనాగ్ని చందన్‌రావు జీవితకాల సాఫల్యం అని, తన ఇంటికి సాక్షాత్తు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి రప్పించుకున్న ఘనత ఆయనదని వివరించారు. ఈ పుస్తకంలోని 171 కవితలు వేటికవే ప్రత్యేక తలతో చదువరులను ఆనందింపచేస్తాయని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన హరిదా రచయితల సంఘం అధ్యక్షులు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ విపి చందనరావు తాను ఎన్నుకున్న రెండు మార్గాలలో విజేతగా నిలిచాడని, వ్యాఖ్యానంలో సభా సామ్రాట్‌గా విజయకేతనం ఎగిరేసాడని, కవిత్వంలో ఎన్నో హృదయాలను స్పందింప చేశాడని పరవశింపచేశాడని సవ్యసాచిగా నిలిచాడని కొనియాడారు. గౌరవ అతిథిగా పాల్గొన్న విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి పి.సరోజినీ దేవి మాట్లాడుతూ.. అలతి అలతి పదాలతో అద్భుతమైన కవిత్వం రాయడంలో విపి చందన్‌రావు సిద్ధహస్తుడని అభినందించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న ఇసిత్రం సేమ్ పంచారెడ్డి లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేశనకుర్తి వీరభద్రా చారి ఆశయాలకు అనుగుణంగా చందన్ రావు సాహిత్య రంగంలో ఎదిగాడని వివరించారు. మరో గౌరవ అతిథి ప్రముఖ కవి కందాళై రాఘవాచార్య మాట్లాడుతూ.. డాక్టర్ సి.నారాయణరెడ్డి అభిమానాన్ని అందుకున్న చందన్ రావును ఆయన "చందనా నా హృదయ నందనా" అని ఆప్యాయతను పంచిన సందర్భాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెరసం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, తిరుమల శ్రీనివాస్ ఆర్య, గంట్యాల ప్రసాద్, డాక్టర్ కాసర్ల నరేష్‌రావు, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, డాక్టర్ పి.రామ్మోహన్‌రావు, డాక్టర్ గణపతి అశోక్ శర్మ, టి.రేణుక, వసంత లక్ష్మణ్, పద్మావతి, సమత, బైస వీణ, బైస హరిదాస్, మధుసూదన్, ఉదయ్, ఆర్.మధు, తల్లావజ్జల మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం హరిదా రచయితల సంఘం పక్షాన వి పి చందన్ రావును ఘనంగా సన్మానించారు.


కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న పలువురు

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్/బాల్కొండ

గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని స్థానిక సుభాష్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ చర్చిలో ఉదయం 6:30 నుంచి చర్చి ఫాదర్ అండ్ జోసెఫ్ అసిస్టెంట్ ఫాదర్ రోమల్డో ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు సిలువ మార్గం లో అనుభవించిన కష్టాలను 14 స్థలాల రూపంలో యూత్ సభ్యులు నిర్మల హృదయ గ్రౌండ్ నుంచి ప్రదర్శనగా చర్చి వరకు నిర్వహించారు. ఆదిలాబాద్ నుంచి అతిథిగా విచ్చేసిన ఫాదర్ మాదాను రవికుమార్ వాక్యప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు, కౌన్సిల్ సభ్యులు డేవిడ్ బాలస్వామి, లోడ్ రెడ్డి, ప్రవీణ్, అగస్టీన్, హ్యారీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే..

బాల్కొండ : మండల కేంద్రంలోని చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాస్టర్ అనంతరావు క్రైస్తవులకు గుడ్ ఫ్రైడే ప్రత్యేకతలను, ప్రాముఖ్యతను వివరించారు.


బాల్కొండలో..






కంఠేశ్వర్ : చర్చిలో ప్రార్థనలు

దోమలతో రోగాలు.. నియంత్రణే నివారణ

- డాక్టర్ మానస, హెఈఓ శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అపరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని తద్వారా రోగాలు వస్తాయని, అందుకు దోమల నియంత్రణతోనే రోగాలు రాకుండా నివారించవచ్చునని డాక్టర్ మానస, హెఈఓ శంకర్ అన్నారు. మండలంలోని నడిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్‌వాయి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మానస రోగులకు చికిత్స అందించారు. ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ ప్రజలలో అవగాహన కల్పిస్తూ దోమల వలన కలిగేటువంటి వ్యాధులపై ప్రజలలో పూర్తిస్థాయిలో చైతన్యం తీసుకువచ్చారు. పరిసరాల అపరిశుభ్రత వల్ల నీరు కలుషితమవుతుందని, రోగాలు వృద్ధి చెందుతాయని తద్వారా టైఫాయిడ్, కలరా, కామెర్లు వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. వ్యాధుల నివారణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, వైద్యఆరోగ్యశాఖ రోగులకు చికిత్స అందిస్తుందని చెప్పారు. పంచాయతీరాజ్, పురపాలక శాఖ పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, గ్రామీణ నీటి సరఫరా ప్రజారోగ్య శాఖలు నీటి నాణ్యతను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఏకకాలంలో యుద్ధప్రాతిపదికన జరగాలని, ప్రతిరోజు చెత్తాచెదారాన్ని తొలగించాలని స్థానిక సంస్థల ద్వారా ఫాగింగ్ నిర్వహించాలని నడ్పల్లి మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్‌రావును ఆదేశించారు. చికెన్ గున్యా లాంటి వ్యాధులలో జ్వరంతో కీళ్ల నొప్పులు వాపులు జాయింట్ పెయిన్లు చాలా తీవ్రంగా వేధిస్తుంటాయని వివరించారు.


వైద్యశిబిరంలో నిర్వహిస్తున్న దృశ్యం

జర్నలిస్టు వెంకట్ రాంకోటికి ఆర్థిక సహకారం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/డిచ్‌పల్లి

జర్నలిస్టు వెంకట్ రాంకోటికి ఆర్థిక సహకారం అందించడంతో పాటు చికిత్స నిమిత్తం చేయూతనిస్తామని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. బాజిరెడ్డి గోవర్ధన్ రూ.లక్ష, ధన్‌పాల్ సూర్యనారాయణ రూ.50 వేలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారికి టియూడబ్ల్యూజె, ఐజెయు జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

కాంగ్రెస్‌తోనే రైతులందరికీ న్యాయం

- మహాజన సభలో చైర్మన్ రాంచందర్‌గౌడ్


మాట్లాడుతున్న చైర్మన్ రాంచందర్‌గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతులందరికి న్యాయం చేసేదని, త్వరలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా సూపర్‌వైజర్‌లను నియమించినట్టు ఖిల్లా డిచ్‌పల్లి సహకార సొసైటీ నూతన చైర్మన్ రాంచందర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం సహకార సొసైటీలో మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద నీరు, టెంట్ సౌకర్యం కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతులకు బీమా, రుణ సదుపాయం, రైతు సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సిఈఓ కిషన్, డైరెక్టర్లు సతీష్‌రెడ్డి, రాము, లత, గంగారెడ్డి, హరిచంద్, సూపర్‌వైజర్ మోహన్‌రెడ్డి, రైతు నాయకులు సుదర్శన్, ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభం కానున్న శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అ శాఖ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు బ్యూటీ పార్లర్ (30 రోజులు), మగ్గం వర్క్ శిక్షణ (30 రోజులు), టైలర్ శిక్షణ (30 రోజులు) ఉంటుందని పేర్కొన్నారు. పురుషులకు సెల్‌ఫోన్ రిపేర్ (30 రోజులు), ఎలక్ట్రీషియన్ (హౌజ్‌వైరింగ్) 30 రోజులు, ఫోర్‌వీలర్ (కార్ డ్రైవింగ్) (30 రోజులు), ఫోటోగ్రఫీ అండ్ వీడియో గ్రఫీ-30 రోజులు, ఆసక్తి గల 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువతీ యువకులు ధృవీకరణ పత్రాలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డ్, పదవతరగతి సర్టిఫికెట్, ఐదు ఫోటోలు తీసుకొని వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ తెలిపారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్, శిక్షణా పూర్తిగా ఉచితంగా అందజేస్తామని, శిక్షణా అనంతరం ధృవీకరణ పత్రం, టూల్ కిట్ కూడా అందజేస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు టీటీడీసీ క్యాంపస్, వెలుగు ఆఫీస్ పక్కన డిచ్‌పల్లి ఫోన్ నెంబర్ 08461-295428 సంప్రదించవచ్చని సూచించారు.

గంగాగౌడ్ కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వడ్డీ మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ గంగాగౌడ్ కుటుంబాన్ని గురువారం రాత్రి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి పరామర్శించారు. బిజెపి మాజీ మండలాధ్యక్షులు చుక్క రాజుగౌడ్ తమ్ముడి భార్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గోపికృష్ణ, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ శైలేష్ కుమార్, జన్నెపల్లి మాజీ సర్పంచ్ రచ్చ సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి ఎల్బీ పోచయ్య, దేశ్‌పేట్ పోశెట్టి, అన్నం పోశెట్టి, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

నీలా క్యాంప్‌లో గుడ్ ఫ్రైడే

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా క్యాంప్ మరియా రాణి చర్చిలో ఫాదర్ వినోద్, సిస్టర్ నిర్మల ఆధ్వర్యంలో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. ప్రార్థనలను చేసుకుంటూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శిలువ మార్గం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.


శిలువమార్గం నిర్వహిస్తున్న దృశ్యం

స్కూలు బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

స్కూలు బస్సు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఎస్సై వినయ్ కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని సాహెబుపేట్ గ్రామానికి చెందిన నల్ల చిన్న గంగారాం (70) అనే వృద్ధుడు వేల్పూర్‌కు నడిచి వస్తుండగా సాహెబుపేట్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ప్రైవేటు స్కూలు బస్సు డ్రైవర్ అజాగ్రత్తతో ఢీకొట్టింది. అతడిని జిల్లా కేంద్రంలోని హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే అతను మృతిచెందాడు. మృతిచెందిన వృద్ధుడికి కూతురి వరుస అయిన సాయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ధాన్యం దళారులకే..

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం


ధాన్యాన్ని తూకం వేస్తున్న కూలీలు

- 100 కిలోల సంచిలో నలుగున్నర కిలోల తరుగుతీస్తున్న వ్యాపారులు
- నిండా మునుగుతున్న రైతులు
- బోనస్ లాస్
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-మాక్లూర్

యాసంగి సీజన్ ఆరంభంలో నాట్లు వేసిన రైతుల పంట ప్రస్తుతం చేతికొచ్చింది. వరి పంటను కోసి రైతులు ధాన్యం కుప్పలను ఎండబెడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఇప్పటికీ ప్రారంభించలేదు. దీంతో వారు దళారులకే తమ ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. తద్వారా తీవ్రంగా నష్టపోతున్నారు.

మాక్లూర్ మండలంలో 24,318 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఒక్కో ఎకరానికి సగటున 26 క్వింటాళ్ల వరి ధాన్యం చొప్పున మండలం మొత్తం 6,32,268 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చే అవకాశముంది. ఇప్పటికే వరి కోతలు మొదలయ్యాయి. ఈ ధాన్యాన్ని రోడ్లపై, ఖాళీ మైదానాల్లో కుప్పలుగా రైతులు పోస్తున్నారు. అయితే వాతావరణంలో మార్పు వల్ల వర్షం పడుతుందేమోనని, ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని ఆందోళన రైతుల్లో నెలకొంది. దానికి తోడు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీన్ని అవకాశంగా మలుచుకున్న దళారులు.. గ్రామాలపై పడ్డారు. క్వింటాకు కేవలం రూ. 1900 నుంచి 1950 చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో క్వింటాలుకు రైతులు గరిష్ఠంగా రూ.253 నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ యేడాది వరి ఏ గ్రేడు రకానికి రూ.2203, బీ గ్రేడ్ రకానికి రూ.2183 ధర నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో ఎకరాకు రైతులు రూ.6578 వేల వరకు నష్టపోతున్నారు. అంటే ఐదు ఎకరాలు ఉన్న మధ్య తరగతి రైతు రూ.32,590 రూపాయలు నష్టపోతున్నాడు. దీనికితోడు 100 కిలోల సంచిలో నల్గున్నర కిలోలు తరుగు పేరిట కోత కోస్తున్నారు.

దళారులకు అమ్ముకున్న వారికి బోనస్ చెల్లదు..

నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఈ బోనస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకున్న రైతులకు మాత్రమే అందుతుంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్‌ను ఎప్పటినుంచి అమలు చేస్తామనేది స్పష్టతనివ్వలేదు. ఒకవేళ.. ఈ యాసంగి పంట నుంచి బోనస్‌ను ప్రభుత్వం అమలు చేస్తే ధాన్యాన్ని దళారులకు విక్రయించే రైతులు ఎకరానికి సుమారు రూ.13 వేలు నష్టపోయే అవకాశం ఉంది.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి..

రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.500 బోనస్ చెల్లించాలని రైతుల నుంచి డిమాండ్ వ్యక్తమవుతోంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 సంవత్సర 10వ తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో చదివిన నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం గ్రూప్ ఫోటోలు దిగి, సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బిట్ల అనిల్, సదరం నరసయ్య, రాజేందర్, స్వామి, నరేష్, క్యాతం సంతోష్, కిషన్, రంజిత్, రాజేష్, ఉట్నూర్ రాజేష్, గోపిడి రాజేష్, చింత నరేష్, మైసల అర్జున్, గొల్ల అనిల్, గొల్ల మహేష్, వేముల సురేష్, ఆకోజి అజయ్, ఉట్నూరు రవి, ప్రశాంత్, గంగారెడ్డి, మధు, రహూఫ్, రాకేష్, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ అబ్బవ్వ అంత్యక్రియలు పూర్తి


అబ్బవ్వ (ఫైల్)


అంత్యక్రియల్లో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రానికి చెందిన ఆశావర్కర్ అబ్బవ్వ అంత్యక్రియలు శుక్రవారం పూర్తయ్యాయి. గురువారం మధ్యాహ్నం ఆమె ఎడపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఇంటికి వెళుతున్న క్రమంలో.. ఎడపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు మోటార్ సైకిల్‌తో బలంగా ఢీకొట్టాడు. దీంతో అబ్బవ్వ అక్కడికక్కడే మృతిచెందింది.

ఆశావర్కర్ మృతి బాధాకరం..

అబ్బవ్వ మృతిచెందడం బాధకరమని పలువురు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సిఐటీయు జిల్లా నాయకులు జంగం గంగాధర్, సిఐటీయు నాయకులు శంకర్‌గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, ఆశావర్కర్ల సీనియర్ నాయకులు గైని రాజమణి, పద్మ, ఆయా గ్రామాల ఆశ వర్కర్లు నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు సుద్దపల్లి విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు లికిత, గంగోత్రి, నిశిత జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ శుక్రవారం తెలిపారు. ఈ నెలలో నేరేడు కొండ, అదిలాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి ఈనెల ఔరంగాబాద్ మహారాష్ట్రలో నిర్వహించే 29 నుంచి 1వరకు జరగబోయే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ దీప్తివాణి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, పిడి, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక అభినందించారు.


ఎంపికైన విద్యార్థులకు అభినందన

నేడు డిచ్‌పల్లి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3గంటలకు నిజామాబాద్ ఆర్.డి.ఓ. రాజేందర్ కుమార్ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షుల గద్దె భూమన్న అలియాస్ శ్రీనివాస్‌పై వచ్చిన అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం ఉంటుందని ఎంపిడిఓ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎం.పి.టి.సి.లు సమయానికి హాజరు కావాలని ఎంపిడిఓ రవీందర్ సూచించారు. సమావేశం సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కార్యాలయం ఆవరణలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు.

నూతన ఎంపీపీగా నర్సయ్య, వైస్ ఎంపీపీగా సాయిలు..?

గత నాలుగేళ్లుగా ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా కొనసాగిన ఇద్దరిపై 13 మంది ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానానికి సన్నాహాలు చేసుకున్నారు. నిజామాబాద్ ఆర్డీవోకు అవిశ్వాస తీర్మాన కాపీని అందజేశారు. మండల పరిషత్ అధ్యక్షుడు(ఎంపీపీ) గద్దె భూమన్నపై అవిశ్వాసం పెట్టేందుకు గత కొన్ని నెలల నుండి ఎంపీటీసీలు ఎదురు చూస్తున్నారు. దానిలో భాగంగానే వైస్ ఎంపీపీ శ్యాంరావుపై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గారు. ఆ సమయంలో ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని అనుకున్న హైకోర్టు స్టే విధించడంతో ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టకుండానే వైస్ ఎంపీపీపై పెట్టారు. హైకోర్టు స్టే కొట్టి వేయడంతో తప్పనిసరిగా అవిశ్వాస తీర్మానానికి సర్వం సిద్ధం చేశారు. మొత్తం ఎంపీటీసీ సభ్యులు 17 మంది ఉండగా 13 మంది అవిశ్వాసానికి మద్దతు తెలుపుతూ సంతకాలు చేశారు. అవిశ్వాసానికి సంతకాలు చేసిన వారిలో ఎంపీటీసీలు, ఉగ్గెర కృష్ణవేణి, నర్సింగ్‌రావు పులి, రాజమణి సాకలి, గండోల్ల సుప్రియ, దుంపాల సౌమ్య, అల్లుల్ల బాలగంగాధర్, చిన్నోల్ల నర్సయ్య, పోతర్ల సూజత, రాథోడ్ బిక్య గోదవరి సాంపల్లి, ఎంబడి సంతోషం, అప్పల మంజుల, దండుగుల సాయిలు ఉన్నారు.

ప్రస్తుతం ఎంపీపీగా ఉన్న గద్దె భూమన్న, వైస్ ఎంపీపీగా ఉన్న శ్యామ్‌రావు బీఆర్ఎస్ నుండి గెలుపొంది బిజెపిలోకి వెళ్లారు. 13 మందిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఎంపీటీసీలు అవిశ్వాసానికి సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఇద్దరు ఎంపిటిసిలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పలువురు ఎంపీటీసీలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొని అవిశ్వాసానికి రెడీ అయ్యారు. మొత్తం 17 మంది ఎంపీటీసీలకు గాను 13 మంది అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారు. మిగతా నలుగురు అవిశ్వాసానికి దూరంగా ఉన్నట్లు తెలిసింది. ఎంపీపీగా నడ్పల్లి 2ఎంపిటిసి నర్సయ్యను, వైస్ ఎంపీపీగా అమృతపూర్ గ్రామానికి చెందిన ఎంపిటిసి సాయిలును ఎన్నుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

లిల్లీపుట్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని లిల్లీపుట్ పాఠశాలలో విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పిల్లలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్య పెరుగుదల ముఖ్యమేనని తెలిపారు. శారీరక మానసిక అభివృద్ధి నిజమైన విద్య అని తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ వన్నెల్లాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి పి.రాజగంగరామ్ హాజరై విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. చదువంటే కేవలం ఉపాధ్యాయుడి పాత్రనే కాకుండా.. తల్లిదండ్రులది, సమాజానిది ఎంత పాత్ర ఉంటుందో కూలంకషంగా వివరించారు. సైకాలజిస్ట్ అరవింద్ ఆర్ట్ ఆఫ్ పేరెంట్ హాలో భాగంగా తల్లిదండ్రుల పాత్ర విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని తెలియజేశారు. చదివంటే కేవలం ర్యాంకులు కాదని జీవితంలో ఎదుర్కొనే సమస్యలను పోరాడే శక్తి అని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉల్లాసంగా తమ నృత్య ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీ రామగిరి దాస్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లు అబ్బవ్వ, సరోజ కుటుంబాలకు 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- పార్థీవ దేహంతో నిరసన ర్యాలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆశావర్కర్లు అబ్బవ్వ, సరోజ కుటుంబాలకు 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గైని రాజమణి డిమాండ్ చేశారు. ప్రమాదంలో చనిపోయిన ఆశావర్కర్లు అబ్బవ్వ, సరోజ పార్థివ దేహాల సందర్శన కోసం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆశావర్కర్లు తరలివచ్చారు. అనంతరం శుక్రవారం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గైని రాజమణి మాట్లాడుతూ.. ఆశావర్కర్ల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పనిభారం మోపడం తప్ప సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదని అన్నారు. అబ్బవ్వ, సరోజ కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు కనీస వేతనం రూ.21వేలు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్, ధ్యారంగుల కృష్ణ, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు రేణుక, సుకన్య, శాంతి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

రెండు లక్షల రుణమాఫీతో పాటు రూ.500 బోనస్ ఇవ్వాలి

- నాగేపూర్ సొసైటీ చైర్మన్ శైలేష్ కుమార్


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ శైలేష్‌కుమార్

నవతెలంగాణ-నవీపేట్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేస్తూ వరి ధాన్యం క్వింటాలుకు 500 బోనస్ ఇవ్వాలని రైతులు తీర్మానించినట్లు నాగేపూర్ సొసైటీ చైర్మన్ శైలేష్ కుమార్ అన్నారు. కోస్లీ గోదాం వద్ద 61వ మహాజన సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ కార్యాలయంలో ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువుల ఏర్పాటు చేసేందుకు, కోస్లీ గోదాం వద్ద బోరు మోటర్ వేయాలని తీర్మానించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ మొదటి వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి రమేష్ సంఘం జమ ఖర్చుల పట్టికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సాయన్న, అంబర్ సింగ్, రవీందర్, శ్రీనివాస్ రావు, వీరన్న, సాయిలు, రాజుభాయి సిబ్బంది రాజశేఖర్, రఫీ, సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

ముందు జాగ్రత్తే మందు.. జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


కొబ్బరి బొండాల విక్రయం

నవతెలంగాణ-ఆర్మూర్

ఉమ్మడి జిల్లాలోని అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఎండలో బయటకి రావాలంటేనే జంకుతున్నారు. అయితే చిన్నపాటి జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లలో మార్పులతో ఆరోగ్యంతో పాటు వేడిమి నుంచి ఉపశమనం పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువగా తిరిగేవారు ఎండ దెబ్బ నుంచి రక్షణ పొందేందుకు కొన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. వడదెబ్బకు ముఖ్య కారణాలు..

వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్తే సరైన మందు అని వైద్యులు సూచిస్తున్నారు. ఎండ తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత మెదడు మీద ప్రభావం చూపి మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే హైపోథలామస్ దెబ్బతిని వడదెబ్బకు గురవుతారు. దీనినే హీట్ స్ట్రోక్ లేదా సన్ స్ట్రోక్ లేదా వడదెబ్బ అంటారు. శరీరం ఎక్కువసేపు వేడికి గురికావడం వల్ల చెమట రూపంలో శరీరంలోని సోడియం క్లోరైడ్ బయటకు వస్తుంది.. దీంతో శరీరంలో నీటి నిష్పత్తి తగ్గిపోతుంది. ఎండలో ఎక్కువసేపు పనిచేసే వారి శరీరం గంటకు మూడు లేదా నాలుగు లీటర్ల నీటిని కోల్పోతుంది. వెనువెంట నీరు తాగకుంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఎక్కువగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, గుండె జబ్బులు, రక్తపోటు ఉన్నవారు వడదెబ్బకు గురవుతారు.

లక్షణాలు..

వడదెబ్బకు గురైన వారికి విపరీతమైన తలనొప్పి, తల తిరగడం, తీవ్రంగా జ్వరం, మగత నిద్రలో కలవరింతలు, ఫిట్స్ రావడం అపస్మారక స్థితిలోకి వెళ్తారు. వెంటనే వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించకుంటే చనిపోయే ప్రమాదం ఉంటుంది. వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే బయటకు వెళ్లేటప్పుడు వెంట ఉల్లిపాయ శరీరానికి తగిలేటట్లు వెంట ఉంచుకోవాలి. తరచూ నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగడం ఉత్తమం. ఉదయం, సాయంత్రం స్నానం చేయడం ఉపశమనాన్ని ఇస్తుంది. చల్లని కూలర్లు ఏర్పాటు చేసుకోవాలి. కుండ నీళు తాగడం ఉత్తమం. ధారాళంగా గాలి ఆడేట్లు కిటికీలు తెరచి ఉంచుకోవాలి.

పండంటి ఆరోగ్యం కోసం..

ప్రతి సంవత్సరం వేసవిలో శీతల పానీయాల వినియోగం రెట్టింపు స్థాయిలో ఉంటుంది. అయితే ఇటీవల సామాజిక మధ్యమాలు వీటి వినియోగంపై ప్రచారం పెరగడంతో ప్రజల్లో చైతన్యం వచ్చింది. వైద్యులు కూడా శీతల పానీయాల కంటే పండ్లు, పండ్ల రసాలు తీసుకోవడం ద్వారా వేసవి నుంచి ఉపశమనంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని అంటున్నారు. దీంతో ప్రజలు పుచ్చకాయలు, కొబ్బరి బొండాలు, మజ్జిగ, లస్సి, ఫ్రూట్ సాలిడ్లను తాగేందుకు ఎక్కువగా ఆసక్తి కనపరుస్తున్నారు. వీటి వినియోగంతో శరీరానికి విటమిన్లతో పాటు ఆరోగ్యానికి మంచి జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

కొబ్బరి బొండాలు, పుచ్చకాయలకు పెరిగిన గిరాకీ..

నీటి శాతం ఎక్కువగా ఉండే కొబ్బరి బొండాలకు డిమాండ్ బాగుం . పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలలోని నిజామాబాద్, కామారెడ్డి, బాన్సువాడ, బోధన్, ఎల్లారెడ్డి, ఆర్మూర్ తదితర పట్టణాలలో ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి, కాకినాడ, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజు లారీల కొద్దీ కొబ్బరి బొండాలను తీసుకువచ్చి ఇక్కడ అమ్ముతుంటారు. గత సంవత్సరం 40 రూపాయలు ఉండగా ఈసారి పట్టణంలో రూ.60 వరకు ఒక్కో బొండం ధర ఉంది. ఉమ్మడి జిల్లాలలో సగటున 30,000 కొబ్బరి బొండాలు అమ్ముడుపోతున్నాయి. గత సంవత్సరం పుచ్చకాయలు కిలోకు 20 రూపాయలు ఉండగా ఈసారి 30 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. ఇంకా పెరుగుతాయని వ్యాపారులు అంటున్నారు.. పుచ్చకాయల వల్ల శరీరానికి చల్లదనంతో పాటు ఆరోగ్యం బాగుంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

తగు జాగ్రత్తలు పాటించాలి



ఎండలు ఎక్కువగా ఉండే సమయంలో పనుల ఒత్తిడి లేకుండా ప్రణాళిక రూపొందించుకోవాలి. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు బయట తిరగవద్దు. మంచినీరు, సీజనల్ పండ్లు తీసుకోవాలి. చర్మ సంరక్షణకు సైతం జాగ్రత్తలు తీసుకోవాలి. **- యు.రాకేష్‌కుమార్, వైద్యులు, బాలరాజ్ మెమోరియల్ హాస్పిటల్, ఆర్మూర్.**

పెంచిన ఫీజులు వెంటనే తగ్గించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సర్టిఫికెట్ల ఫీజులను పెంచడాన్ని నిరసిస్తూ సెంట్రల్ లైబ్రరీ వద్ద తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌ల దిష్టిబొమ్మ ను ఏబీవీపీ తెలంగాణ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ సెక్రెటరీ అమృత్‌చారి మాట్లాడుతూ.. యునివర్సిటీలో ఎగ్జామినేషన్ బ్రాంచ్ నుంచి వెలువరించే సర్టిఫికెట్ల ఫీజులను పెంచడాన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తెలంగాణ యూనివర్సిటీ, యూనివర్సిటీ పరిధిలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకుంటారని, ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు రాక, మెస్ బిల్లుల రాక విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం సొంత డబ్బులు కట్టాల్సి వస్తుందని అవేదన వ్యక్తం చేశారు. అలాంటి సమయంలో యూనివర్సిటీలో కాన్వొకేషన్ ఫీజ్‌ను 700 నుంచి 3500 పెంచడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, ఉపాధ్యక్షులు సింహాద్రి, జాయింట్ సెక్రటరీ సమీర్, అజయ్, సంతోష్, సాయికృష్ణ, దీపక్, హరినాథ్, వినోద్, జగడం సాయి, సంతోష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.